నాన్నా ఎక్కడున్నావు!

- వెక్కివెక్కి ఏడుస్తున్న కుమారుడు
- భర్త దినేష్ కోసం భార్య ఎదురుచూపులు



తండ్రికోసం రోధిస్తున్న కుమారుడు, భార్య

ముషీరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ వినోభానగర్‌లో వరదనీటి నాలాలో కొట్టుకుపోయిన దినేష్ ఆచూకీ మూడు రోజులైనా లభించకపోవడంతో తండ్రి అంటే అమితప్రేమ ఉన్న కుమారుడు కార్తిక్ తండ్రి కోసం 'నాన్నా ఎక్కడ ఉన్నావు... త్వరగా ఇంటికి రా' అని వెక్కివెక్కి ఏడుస్తున్న కుమారుడు కార్తిక్(3). మూడు రోజులైనా కట్టుకున్న భర్త కానరాక ఎక్కడున్నాడో జాడ తెలియక, ఆయనకు ఏమైందో అర్థంకాక బంధువులను, దినేష్ స్నేహితులను అడుగుతూ రోధిస్తున్న భార్య రాజశ్రీని చూసిన ప్రతి ఒక్కరి గుండెను కలిచివేస్తున్నాయి. ఆమె రోధనలతో చూపరులు కంటతడి పెడుతున్నారు. ఇంటి గుమ్మం వద్దే తల్లీ కొడుకూ కూర్చోని ఏడుస్తూ దినేష్ కోసం కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరితరం కావడంలేదు. పైకి ధైర్యం చెప్పుతున్నప్పటికీ ఆ ఇద్దరినీ చూసిన ప్రతి ఒక్కరికీ కంటతడి ఆగడం లేదు. వారి ఇంటి ముందు నుంచి ఎవరు వెళ్లినా దినేష్ ఆచూకీ లభించిందా, ఎక్కడ ఉన్నాడని రాజశ్రీ ఆరా తీస్తూ తిండి, నిద్ర మాని ఏడుస్తున్నది.

ఇళ్లలోకి చేరుతున్న వరదనీరు



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో నల్లకుంట డివిజన్‌లోని పాతరామాలయం పరిసర ప్రాంతాల్లో అధికంగా వరదనీరు ఇళ్లలోకి చేరుతుందని కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. దీంతో జీహెచ్ఎంసీ, జలమండలి ఇతర శాఖల అధికారులు ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం నల్లకుంట డివిజన్‌లోని పాత రామాలయం పరిసర ప్రాంతాలలో మ్యాన్‌హోల్స్ నాలా బాక్స్ ఎక్స్‌టెన్షన్ రిపేర్ సమస్యలపై జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్, ఏడీఈఈ శ్రీనివాస్, ఎస్ఎన్‌డీపీ డీఈ సందీప్, ఏఈ శ్రీనివాస్, సూపర్‌వైజర్ నరేందర్‌తో కలిసి పర్యటించి పరిశీలించారు. అనంతరం సమీక్షా సమావేశంలో ఆమె అధికారులతో చర్చించారు. పాతరామాలయం పరిసర ప్రాంతాలలో మ్యాన్‌హోల్, నాలా బాక్స్ ఎక్స్‌టెన్షన్ రిపేర్ పనులను తక్షణమే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ జోషి తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల బంద్ విరమణ నిర్ణయం హర్షణీయం

రాంనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాలేజీల బంద్ విరమిస్తూ ఉన్నత విద్యా సంస్థలు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రకటించిన హామీ ప్రకారం రూ.1200 కోట్ల బకాయిలలో రూ.600 కోట్లను ప్రభుత్వం ప్రకటించడం వల్ల కాలేజీ యాజమాన్యాలకు ఊరట లభిస్తుందన్నారు. మొత్తం 8 వేల కోట్ల ఫీజుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటినీ కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కృషి చేయాలన్నారు.

మూసీ నదిలో కొండచిలువ!

అంబర్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మూసీ నది పరీవాహక ప్రాంతంలో మంగళవారం కొండచిలువ కనిపించడంతో కలకలం కలిగింది. మూసారాంబాగ్ బ్రిడ్జి ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కోసం వచ్చిన కార్మికులు మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో పనులు ముగించుకుని తమ నివాసం ఉంటున్న మూసీనది సమీపంలోని గుడిసెల దగ్గరకు వెళ్లారు. అదే సమయంలో మూసీనదిలో వారికి 12 అడుగుల కొండచిలువ కనిపించింది. దీంతో వారు భయాందోళనకు గురై అంబర్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే స్పందించి స్నేక్ క్యాచ్ పిలిపించారు. అయితే కొండచిలువ నదిలోకి వెళ్లడంతో పట్టుకోలేకపోయారు. నగరంలో కురుస్తున్న వర్షాలకు పై నుంచి వస్తున్న వరదనీటికి మూసీ నదిలో ఇటీవల కొండ చిలువలు వస్తున్నట్లుట స్థానికులు పేర్కొంటున్నారు. కొండచిలువల వల్ల తాము రాత్రులు జాగారం చేయాల్సి వస్తుందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

టీజీఓఎస్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీఓఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావును తెలంగాణ కార్మికశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మికశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు బి.జాసన్ మాట్లాడారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ కౌన్సిల్ పునరుద్ధరణలో శ్రీనివాసరావు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో సంఘం రాష్ట్రకార్యదర్శి బి.సత్యనారాయణ, శ్రీరామ్‌రెడ్డి, రాష్ట్ర కార్మికశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు శ్యామ్‌సుందర్‌జాజు, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, కమిటీ సభ్యుడు నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని ప్రసిద్ధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు కనులపండువగా జరుగుతున్నాయి. సోమ, మంగళవారాల్లో శ్రీకృష్ణజననం, శ్రీభాగవత పురాణ కాలక్షేపం, తిరుమంజనం, ప్రబంధ సేవాకాలం, ఆరగింపు, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకవంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఆలయ సంప్రదాయం ప్రకారం అత్యంత వైభవంగా, భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈవో దేవనాథం, పునర్‌నిర్మాణకమిటి చైర్మన్ జానకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలోని అమ్మవారి మందిరంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సినీగాన విభావరి

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాప్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్టీసీక్రాస్‌రోడ్ సిటీకల్చర్‌సెంటర్‌లో నిర్వహించిన అన్నీ కొత్తసినిమాల పాటల ఆలాపన ప్రేక్షకరంజకంగా సాగింది. 5వ కార్యక్రమంగా నిర్వహించిన పాటల ఆలాపనలో గాయనీగాయకులు తమ ప్రతిభతో ప్రేక్షకులను అలరించారు. ముఖ్యఅతిథిగాపాల్గొన్న సామాజికవేత్త పీవీపీ.అంజనికుమారిని సన్మానించారు. సుబ్బరామన్, జ్యోతి, శ్రీను, భాగ్యలక్ష్మి, సావిత్రి, ఆనంద్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని మేకల కాపరితో పాటు మరో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన్నట్లు కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా భీమ్గల్ మండలం గుండారం గ్రామానికి చెందిన షేక్ అలీబిన్ ముబారక్(24) పాతబస్తీలోని వట్టేపల్లిలో ఉంటూ మేకల కాపరిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఫలక్‌నుమా.- బుద్వేలు రైల్వేస్టేషన్ నడుమ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అదేవిధంగా 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం రాత్రి విద్యానగర్ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముషీరాబాద్‌లో వర్షం వచ్చినప్పుడు

ఎందుకిలా?

ఇప్పటివరకు ఇద్దరు మృత్యువాత, ఒకరు గల్లంతు

ఆందోళనలో నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు

ముషీరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షం వచ్చిందంటే ముషీరాబాద్‌లో నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి స్థానిక నాలాలో వరద నీటి ఉధృతి వల్ల బిక్కుబిక్కుమంటూ ప్రజలు జీవిస్తున్నారు. వర్షం వచ్చినప్పుడే నాలాలను సందర్శిస్తున్న అధికారులు సమస్య శాశ్వత పరిష్కారానికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముషీరాబాద్ నాలా ప్రారంభమయ్యే బాపూజీనగర్‌లోని జమ్‌జమ్‌మసీదు వద్ద గాంధీహాస్పత్రి నుంచి వచ్చే వరద నీటి నాలాను కలపడం వల్ల నాలాలో వరదఉధృతి మరింత పెరిగింది. గతంలో వరద నీరు ప్రవహించినప్పటికీ నష్టం వాటిల్లేది కాదు. కానీ నాలాను కలపడం వల్ల సమస్య తీవ్రమైంది. దీనికి తోడు నాలాను ఆక్రమించి ఇరుపక్కల భవనాలు కట్టడం, నాలాపై స్లాబ్‌లు వేయడం సమస్య మరింత తీవ్రతరం అయ్యింది. నాలా కుచించుకుపోవడం వల్ల వరద నీరు పోవడానికి దారిలేక నాలా చుట్టూ ఉన్న ప్రహరీలపై ఒత్తిడి పడి ప్రహరీలు కూలిపోయి, ప్రమాదాలు జరుగుతున్నాయి.



వినోభానగర్‌లో వరదనీటి తాకిడికి కొట్టుకుపోయిన నాలా ప్రహరీ

ఇప్పటికీ ఇద్దరు మృతి.. ఒకరు గల్లంతు..

నాలాలో వరదనీటి ఉధృతి వల్ల ముషీరాబాద్‌లో ఇప్పటివరకు ఒక మహిళ, విజయ్ అనే వ్యక్తి మృతిచెందారు. దినేష్ అనే యువకుడు మొన్న కురిసిన భారీ వర్షానికి వినోభానగర్‌లో ప్రహరీ కూలి వరదనీటి నాలాలో కొట్టుకుపోయాడు. మూడురోజులైనా అతని ఆచూకీ లభించలేదు. నాలాలో డీసిల్టింగ్ తీస్తున్న సమయాలలో వరద నీటిలో కొట్టుకు వచ్చిన ద్విచక్రవాహనాలు, బీరువాలు తదితర సామగ్రి బయట పడుతున్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి



ముషీరాబాద్‌లో వర్షం పడిన ప్రతి సారి నాలా పరీవాహక ప్రాంతాలు అయిన వినోభానగర్, పార్శిగుట్ట, ఆశీర్వాద్ అపార్టుమెంట్ వీధి, బాప్టిస్ట్ చర్చి వీధి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు నాలాలను శుభ్రపరుస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలి.

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

గాంధీ ఆసుపత్రి నుంచి వచ్చే నాలాను మళ్లించాలి



గాంధీ ఆసుపత్రి నాలా నుంచి వచ్చే వరద నీటిని బాపూజీ నగర్‌లో కలపకుండా వాటిని మరోచోటు నుంచి మళ్లించాలి. ఈ సమస్యపై జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాలలో మేయర్ దృష్టికి తీసుకెళ్లాం. హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం. నాలా వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

- కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్

నాలా ఆక్రమణలను తొలగిస్తాం



ముషీరాబాద్‌లో నాలా పరిసర ప్రాంతాలను పరిశీలించాం. కొంత మంది నాలాలను ఆక్రమించడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నాలాపై నిర్మించిన అక్ర మ కట్టడాలను తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాం.

- హైడ్రా కమిషనర్ రంఘునాథ్



వినోభానగర్ నాలాలో దినేష్ కోసం వెతుకుతున్న పనులను పరిశీలిస్తున్న హైడ్రా ఇన్‌స్పెక్టర్ దత్తూ

మూడు రోజులైనా లభించని దినేష్ ఆచూకీ

- వినోభానగర్ నాలా నుంచి మళ్లీ గాలించిన హైడ్రా సిబ్బంది
- ప్రేయర్‌పవర్ నాలా వద్ద ద్విచక్రవాహనాన్ని బయటకు తీసిన హైడ్రా
- కుటుంబ ఆధారాన్ని కోల్పోయామని రోదిస్తున్న బాధితులు
- ఆచూకీ తెలుకోవాలని అదనపు కలెక్టర్‌కు ఎంఆర్‌పీఎస్ వినతి

ముషీరాబాద్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం కురిసిన భారీవర్షం వల్ల ముషీరాబాద్ వినోభానగర్ నాలాలో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయిన దినేష్(సన్నీ) ఆచూకీ ఇంకా లభించలేదు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కలచివేస్తున్నాయి. హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది వినోభానగర్ నాలాలో దినేష్ పడ్డ చోటు నుంచి 9మంది బృందం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభించలేదు. దీంతో ముషీరాబాద్‌లో ఏ ఒక్కరిని కదిలించినా దినేష్ ఘటనపైనే చర్చించుకుంటున్నారు. హైడ్రా ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ దత్తూ పర్యవేక్షణలో వినోభానగర్, ప్రేయర్ పవర్ చర్చి, పార్శిగుట్ట, ఆశీర్వాద్ అపార్టుమెంట్, అడిక్‌మెట్ వరకు నాలాలో మ్యాన్‌హోల్ కవరులు తెరిచి దినేష్ కోసం గాలించినా ఫలితం లేకుండాపోయింది. ప్రేయర్‌పవర్ చర్చి వద్ద దినేష్ ద్విచక్ర వాహనాన్ని హైడ్రా సిబ్బంది బయటకు తీసారు. వాహనం చోటే చిక్కుకున్నాడేమోనని అనుమానంతో నాలా చుట్టూ స్లాబ్‌ను పగులగొట్టి గాలించినా దొరకలేదు.

దినేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి: ఎంఆర్‌పీఎస్

పేదింటి కుటుంబానికి చెందిన దినేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని, ఆయన ఆచూకీని వెంటనే గుర్తించాలని ఎంఆర్‌పీఎస్ డిమాండ్ చేస్తూ జిల్లా అదనపు కలెక్టర్‌కు వెంకటచారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు గండి కృష్ణ మాదిగ, ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాట్లాడుతూ... దినేష్ ఆచూకీని వెంటనే తెలుసుకోవాలని కోరారు. అనంతరం వినోభా నగర్‌లో దినేష్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు దశరత్, ఎల్లయ్య, విష్ణు, జనార్ధన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిటీ లైబ్రరీలో విస్తృత పోలీసు బందోబస్తు

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగవిద్యార్థులను కలిసి వారి సమస్యలను తెలుసుకోవడానికి జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వస్తుందన్న సమాచారంతో లైబ్రరీ వద్ద మంగళవారం పెద్దఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉదయం పదిగంటలకు కవిత వస్తుందన్న సమాచారంతో పోలీసులు ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచే లైబ్రరీ వద్ద మోహరించారు. లైబ్రరీ ఆవరణలో కుడివైపు ఓపెన్ ప్లేస్‌లో రెండు వ్యాన్‌లు, బయట రెండు వ్యాన్‌లు, వంద మంది పోలీసులు అక్కడ బందోబస్తులో పాల్గొన్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ పర్యవేక్షణలో పోలీసులు లైబ్రరీ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూశారు. కవిత లైబ్రరీకి వచ్చినట్లయితే ఆమెను నిలదీయాలని మరోవర్గం నిరుద్యోగులు ఎదురుచూశారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాలు ఇవ్వకుండా ఉన్నారని ఇప్పుడు ఎలా వచ్చి నిరుద్యోగులను పరామర్శిస్తారని ఆమెను అడుగుతామని నిరుద్యోగులు చెప్పారు. అయితే కవిత వచ్చినట్లయితే ఆమెను లైబ్రరీలోకి రానీయకుండా అడ్డుకుంటామని నిరుద్యోగ విద్యార్థులు కొందరు చెప్పగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కవిత గానీ జాగృతి కార్యకర్తలు గానీ ఎవరూరాలేదు కానీ పోలీసు బందోబస్తు మాత్రం మధ్యాహ్నం వరకు కొనసాగింది.

యుద్ధప్రాతిపదికన రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు

బర్కత్‌పుర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లోని అన్ని బస్తీలలో యుద్ధప్రాతిపదికన రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి చేస్తున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్‌తో కలిసి ఆమె ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంట్రాక్టర్లు వెంటనే ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రాహుల్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాయని వీకే దుర్గకు ఘన సన్మానం

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయని వీకే దుర్గను భానుమతి పురస్కారం, స్వరవిరించి బిరుదుతో సత్కరించారు. మంగళవారం త్యాగరాయ గానసభలో కళావిపంచి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహానటి భానుమతి రామకృష్ణ శతజయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని దుర్గను సన్మానించి మాట్లాడుతూ దుర్గ మధురగాయని అన్నారు.

విప్లవగడ్డపై వీరత్వాన్ని గానం చేద్దాం: వక్తలు

రాంనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విప్లవగడ్డపై వీరత్వాన్ని గానం చేద్దాం, చరిత్రను వక్రీకరిస్తే చెత్తబుట్టలోకి పోతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం యాదిలో తెలంగాణ సాహితీ, తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ సాహితీ ప్రధానకార్యదర్శి ఆనందం అధ్యక్షతన ఈ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో వనపట్ల సుబ్బయ్య, రచయితలు సామిడి జగన్‌రెడ్డి, మోహన్‌కృష్ణ, ఎంవీ.రమణ, సలీమా, బండి సత్తన్న, శరత్‌చంద్ర, అనుముల ప్రభాకర్, ఉదయగిరి, మధుబాబు, గేరా ముజాహిద్, రేఖా, సునీత తదితరులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అంటే ఎంతో మంది వీరుల త్యాగాలతో తడిసిన చరిత్ర అని, రేపటి స్వప్నానికి ఇవ్వాల్టి కన్నుమూత అని కవిత్వాన్ని కీర్తించారు. తెలంగాణ సాయుధ పోరాటానికి మతం పూల్చడం సరైంది కాదన్నారు.

నేడు వీవీబీ యజ్ఞ మహోత్సవం

రాంనగర్, ఆంధ్రజ్యోతి: సుందరయ్యపార్కు విశ్వకర్మ వాకర్ మిత్రుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని మదర్ డెయిరీ పార్కులో నిర్వహించే విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞమహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు రవీందర్‌చారి తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహను మంగళవారం ఆహ్వానించారు.

వీహెచ్ కృషి వల్లే బతుకమ్మకుంట పునరుద్ధరణ



గడ్డం శ్రీధర్‌గౌడ్

రాంనగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ వి.హనుమంతరావు కృషి వల్లే బతుకమ్మకుంట చెరువు పునరుద్ధరణ సాధ్యమైందని కాంగ్రెస్ బాగ్‌అంబర్‌పేట డివిజన్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శ్రీధర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం బతుకమ్మకుంటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాకు గురైన స్థలాన్ని రక్షించి సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో సాధ్యమైందన్నారు. హైడ్రా కమిషనర్ రంగానాథ్ కూడా వీహెచ్ చేసిన పోరాటాన్ని పరిగణలోకి తీసుకుని చెరువు స్థలాన్ని రక్షించి సంవత్సర కాలంలో దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో ఈ చెరువును పునరుద్ధరించారు. ఈ నెల 25న బతుకమ్మ ఉత్సవాలను ఇక్కడ ప్రభుత్వపరంగా నిర్వహించాలని నిర్ణయించడం ముదావహమన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పక్కన మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు తదితరులు

రాంనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీన జరిగే విమోచన దినోత్సవాన్ని ప్రజలందరూ పండుగగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దత్తాత్రేయ అధ్యక్షతన తెలంగాణ విమోచన దినోత్సవంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమోచన దినోత్సవాన్ని ఇంటింటా జరుపుకోవాలని సూచించారు. 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జాతీయ జెండాను ఎగురవేయలేదన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ నిజాం సంస్థాన్ని దేశంలో విలీనం చేశారని తెలిపారు. దీంతో సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలు బానిసత్వం నుంచి బయటకు వచ్చారని పేర్కొన్నారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ నిజాం ఆరాచకాలు చెప్పాలంటే గంటలు, రోజులు చాలవన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ మాజీ ఉపకులపతి తిరుపతిరావు, ప్రొఫెసర్ మురళీ మనోహర్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, మనోహర్‌రెడ్డి, పాశం యాదగిరి, కరుణ, విఠల్‌రావు, చింతా సాంబమూర్తి, కప్పర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విమోచన వేడుకలను అధికారికంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నాయకులు

బర్కత్‌పుర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్స వేడుకలను సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అధికారికంగా నిర్వహించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు డిమాండ్ చేశారు. మజ్లిస్ ఒత్తిళ్లకు తలొగ్గే అధికారికంగా నిర్వహించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగు వేస్తుందని విమర్శించారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2028లో బీజేపీపాలన వచ్చిన తర్వాత తెలంగాణ విమోచన వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామన్నారు. తెలంగాణ ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తుందని, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని అన్నారు. బుధవారం పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే విమోచన దినోత్సవాలకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, యాకర అమృత, నాయకులు ఏడెల్లి అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్, పందిర్ల ప్రసాద్, కన్నె రమేష్‌యాదవ్, ఏ.సూర్యప్రకాష్‌సింగ్, ఎక్కాల కన్నా, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యులతో మాట్లాడుతున్న అంబర్‌పేట క్లస్టర్ ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ పద్మజ

నేటి నుంచి యూపీహెచ్‌సీలలో వైద్య శిబిరాలు

ముషీరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళా, శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(యూపీహెచ్‌సీ)లో 14 రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని అంబర్‌పేట క్లస్టర్ ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ పద్మజ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో అంబర్‌పేట్ క్లస్టర్ పరిధిలోని యూపీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజ మాట్లాడుతూ... బుధవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు యూపీహెచ్‌సీలలో ప్రత్యేక వైద్యశిబిరాలలో గైనకాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, జనరల్ ఫిజిషియన్, డెంటల్, ఆర్థోపెడిక్, రేడియాట్రిక్, ఈఎన్‌టీ, జనరల్ హెల్త్ క్యాంపు, కంటిపరీక్షలు తదితర వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆయా వ్యాధులకు సంబంధించిన ప్రముఖ డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తామన్నారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలి అన్నారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంజూసుధా, బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్యా తదితరులు పాల్గొన్నారు.

వైర్లు కట్.. నిలిచిన రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో బోసిపోయిన చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్‌కార్యాలయం

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వైర్లు కట్ కావడంతో చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల లింక్ దొరక్కపోవడంతో కార్యాలయంలోరెండు రోజులుగా రిజిస్ట్రేషన్ల సేవలు నిలిచిపోయాయి. ఇటీవల విద్యుత్ స్తంభాలపైన ఉన్న ఇంటర్నెట్, కేబుల్‌టీవీ కనెక్షన్ వైర్లను విద్యుత్‌శాఖ సిబ్బంది కట్ చేస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వైర్లు కూడా కట్ అయ్యాయి. దీంతో సోమ, మంగళవారాల్లో ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయం సిబ్బంది బీఎస్ఎన్ఎల్ డీజీఎంకు ఫిర్యాదు చేశారు. ఆయన సూచనలమేరకు సిబ్బంది రెండురోజులపాటు కష్టపడి వైర్ ఎక్కడ కట్‌అయ్యిందో కనిపెట్టి మంగళవారం సాయంత్రం కనెక్షన్‌ను పునరుద్ధరించినట్లు సబ్‌రిజిస్ట్రేషన్‌కార్యాలయం సిబ్బంది వివరించారు. బుధవారం నుంచి తిరిగి యథావిధిగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని తెలిపారు. అయితే పెద్దల అమావాస్య రోజులు కావడంతో రిజిస్ట్రేషన్లు జరగడంలేదని ఒకటిరెండు రిజిస్ట్రేషన్ జరుగుతుండేవని వైర్‌కట్ కావడంతో అవి కూడా జరగలేదని సిబ్బంది తెలిపారు.

కష్టమర్‌పై డెలివరీబాయ్స్ మూకుమ్మడి దాడి?

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్ బస్తీలో సోమవారం అర్ధరాత్రి ఓ కంపెనీ డెలివరీ బాయ్స్ వీరంగం సృష్టించి, కష్టమర్‌ను చితకబాదినట్లు తెలిసింది. కష్టమర్‌పై మూకుమ్మడిగా దాడి చేసినట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి అంబేడ్కర్‌బస్తీకి చెందిన సందీప్ పెన్సిల్ కేక్, పెరుగు ప్యాకెట్ కోసం జెప్టోలో ప్రీపెయిడ్ ఆర్డర్ బుక్ చేశాడు. అయితే ఎంతసేపటికీ కూడా ఆర్డర్ చేసిన వస్తువులు రాకపోవడంతో సందీప్ డెలివరీబాయ్‌ను ఆర్డర్ చేసిన వస్తువు ఎందుకు రాలేదని ప్రశ్నించాడు. సదరు డెలివరీ వ్యక్తులు కష్టమర్ సందీప్‌ను వీఎస్టీ వద్ద ఎస్‌పీ గార్డెన్ వద్ద ఉన్న జెప్టోహబ్‌కు వచ్చి మాట్లాడాలని చెప్పారు. కష్టమర్ సందీప్ అక్కడకు చేరుకుని ఆర్డర్ ఎందుకురాలేదని ప్రశ్నించగా సమాధానం ఇవ్వకుండా డెలివరీ బాయ్స్ అతనిపై దాడికి పాల్పడ్డారు. వెంకట్, రాజు మరికొందరు కలిసి గంజాయి మత్తులో తనపై దాడి జరిగిందని సందీప్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే సందీప్‌పై దాడిచేసిన సంఘటన సీసీ కెమెరా ఫుటేజీల్లో రికార్డ్ అయినట్లు తెలిసింది. ఇదే విషయమై చిక్కడపల్లి పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌ను ప్రశ్నించగా సందీప్ ఫిర్యాదు చేశారని అతను ఆరోపించినట్లు దాడికి పాల్పడ్డ వారిని పీఎస్‌కు రప్పించి ప్రశ్నించి, విచారణ చేస్తామని వివరించారు.